కష్టం అంటే పలికే వ్యక్తి ఆనంద్

- అంతా అండగా నిలవండి
- యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి పిలుపు


రమాకుమారికి హారతి పడుతున్న మహిళలు


62వ వార్డు దుర్గానగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు


లక్ష్మీనగర్‌లో ప్రచారం చేస్తున్న ఆడారి మాలతి, బెహరా భాస్కరరావు


59వ వార్డు ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీలో ప్రచారం చేస్తున్న రమాకుమారి, సురేష్‌యాదవ్

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్తగా వచ్చిన 18 నెలల్లోనే నియోజకవర్గంలో రూ.220 కోట్లతో అభివృద్ధి పనులు చేయించారు.. అదే మీరు ఆదరించి ఎమ్మెల్యే చేస్తే ఇంకెంత అభివృద్ధి చేస్తాడో ఒక్కసారి ఆలోచన చేయండి అని యలమంచిలి మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి కోరారు. 59వ వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీయాదవ్ ఆధ్వర్యంలోఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీ ప్రాంతంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రమాకుమారికి స్థానిక మహిళలు హారతి పట్టి స్వాగతం పలికారు.ఆమె మాట్లాడుతూ కష్టం అని ఎవరు ఆనంద్‌కుమార్ ముందు నిలబడినా కులం ,మతం,పార్టీ చూడకుండా సాయం చేసే గుణం మీ ఆనంధ్‌కుమార్‌ది అన్నారు. పశ్చిమ ఎమ్మెల్యేగా ఉన్న గణబాబు ఏనాడైనా మీ సమస్యలను గుర్తించి న్యాయం చేశారా అని ప్రశ్నించారు. కనీసం గడిచిన ఐదేళ్లలో మీ వార్డులో పర్యటించారా అనేది ఒక్కసారి ఆలోచించండని కోరారు. అలాంటి వ్యక్తిని మీరు గెలిపిస్తే అభివృద్ధి శూన్యమని, ఆనంద్ వంటి మంచి మనిషిని గెలిపిస్తే అభివృద్ధి పరవళ్లు తొక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, వార్డు పార్టీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ,అమరావతి,రాజు,సంపత్‌కుమార్,ఎం.పెంటారావు పాల్గొన్నారు.

- 58వ వార్డు ఎదురువానిపాలెంలో వార్డు పార్టీ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్‌రాజు ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర మహిళానాయకురాలు తోణంగి వెంకటరమణియాదవ్ తదితరులు ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఆడారి ఆనంద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు.

62వ వార్డులో..

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్ పోలింగ్‌బూత్ నెంబర్ 147 పరిధిలో కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు గడప గడపకు వెళ్లి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి పశ్చిమ ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. సంక్షేమం అందరికీ అందాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాల్సిన ఆవశ్యకత ఉందని వివరించారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భీశెట్టి గణేష్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ఆడారితోనే అభివృద్ధి

గోపాలపట్నం: పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ఆడారి ఆనంద్ కుమార్‌ను గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనంద్‌కుమార్ భార్య ఆడారి మాలతి అన్నారు. జీవీఎంసీ 91వ వార్డులోని లక్ష్మీనగర్, రామకృష్ణనగర్ ప్రాంతాల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. ఆనంద్ కుమార్ ఎమ్మెల్యేగా గెలిస్తే ఇక్కడి సమస్యలన్నీ పరిష్కరిస్తారని తెలిపారు. ఆడారి ఆనంద్ కుమార్ సమన్వయకర్త అయిన తర్వాత నియోజకవర్గంలో 641 పనులకు రూ.107.43 కోట్లు వెచ్చించారని వివరించారు. జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పశ్చిమ పరిశీలకురాలు పేడాడ రమణి కుమారి, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గుణిశెట్టి శ్రీనివాసరావు, 92వ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

టీడీపీ,జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక


పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న వైవీ సుబ్బారెడ్డి,ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: జీవీఎంసీ 60, 57,61వ వార్డులకు చెందిన పలువురు టీడీపీ,జనసేన నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు.60వ ప్రాంతానికి చెందిన జనసేన నాయకుడు సాన బంగార్రాజు, 61వ వార్డు ప్రాంతానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వాడాడ సన్యాసిరావు (సన్నియాదవ్) వైఎస్సార్‌సీపీలో చేరారు. నగరంలోని పార్టీ క్యాంప్ కార్యాలయం వద్ద పార్టీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సారథ్యంలో శనివారం జరిగిన కార్యక్రమంలో పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పారు. కార్యక్రమంలో 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ పాల్గొన్నారు.అలాగే 57వ వార్డు నుంచి జనసేన అధ్యక్షుడు కాళ్ల మణిప్రసాద్, 92వ వార్డు నుంచి టీడీపీ సీనియర్ నాయకుడు ఎడ్ల అశోక్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వారంతా మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా పథకాలు అందజేయడంతో పాటు మాట మీద నిలబడే నేతగా ఉండడంతో తామంతా వైఎస్సార్‌సీపీలో చేరినట్టు చెప్పారు. పశ్చిమలో వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడించడానికి శక్తి వంచన లేకుండా పని చేస్తామని చెప్పారు. ఆనంద్‌కుమార్‌తోనే పశ్చిమ అభివృద్ధి సాధ్యమన్నారు.

క్లుప్తంగా

అమృత లక్ష్మికి ఆనంద్ కుమార్ అభినందనలు


అమృత లక్ష్మిని అభినందిస్తున్న ఆనంద్ కుమార్

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ గ్రూప్‌లో 470కు 461 మార్కులు సాధించిన అమృత లక్ష్మీ గారిని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ అభినందించారు. 90వ వార్డు బుచ్చిరాజుపాలెం గవరవీధికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దొడ్డి సతీష్, లక్ష్మీ తులసి దంపతుల కుమార్తె అమృత లక్ష్మి ఇంటర్మీడియెట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

ముగిసిన కెరీర్ గైడెన్స్ తరగతులు


సూచనలిస్తున్న సుధీర్ చంద్ర

గోపాలపట్నం: నరవలోని బెహరా పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిర కెరీర్ గైడెన్స్ తరగతులు శనివారంతో ముగిశాయి. వ్యక్తిత్వ వికాస నిపుణుడు సుధీర్ చంద్ర మాట్లాడుతూ చదువుతో పాటు సాంకేతిక అంశాలను కూడా తెలుసుకోవాలన్నారు. సరైన ప్రణాళిక వేసుకుని క్రమశిక్షణతో కృషి చేస్తే లక్ష్యాన్ని సులువుగా చేరుకోవచ్చునని వివరించారు. బెహరా విద్యా సంస్థల కార్యదర్శి డాక్టర్ బెహరా విజయ చైతన్య మాట్లాడుతూ పదోతరగతి తర్వాత ఎటువైపు వెళ్లాలో నిర్ణయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, కళాశాల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

మర్రిపాలెం: నిర్మాణం జరుగుతున్న ఇంటి శ్లాబ్ పరంజాకు ఉరివేసుకుని ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. తెన్నేటినగర్‌లోని చిన్న కుమార్తె ఇంటికి వెళ్లిన బుదిరెడ్డి సత్యం (63) ఈ నెల 12వ తేదీ శుక్రవారం రాత్రి 11.30 గంటల సమయంలో మేడ మీద శ్లాబ్ పరంజాకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు కాగితాలు ఏరుకుంటూ జీవిస్తూ అదే ప్రాంతంలో నివసిస్తున్నాడు. ఇతడికి మద్యం తాగే అలవాటు ఉంది. పెద్ద కుమార్తె డి.వెంకటలక్ష్మి శనివారం ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో కేసు దర్యాప్తు చేపట్టారు.

విశాఖ పోర్టుతో సమానంగా జీతాలివ్వాలి


గంగవరం పోర్టు గేటు వద్ద బైఠాయించిన కార్మికులు

గాజువాక : విశాఖ పోర్టుతో సమానంగా తమకు కూడా జీతాలను సవరించాలని అదాని గంగవరం పోర్టు కార్మికులు డిమాండ్ చేశారు. గంగవరం పోర్టు ఎంప్లాయీస్ కమిటీ ఆధ్వర్యంలో ఈ అంశంపై గత నాలుగు రోజులుగా ఆందోళనకు దిగిన కార్మికులు తమ ఆందోళనను శనివారం మరింత ఉధృతం చేశారు. కనీస వేతనంగా రూ.36 వేలు చెల్లించాలని, పోర్టులో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించాలని, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, మరణించిన కార్మిక కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా న్యాయం చేస్తూ ఆర్ అండ్ ఆర్‌లో ఉద్యోగంలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పోర్టు లోపల, బయట ఆందోళనకు దిగారు. కార్మికుల ఆందోళనకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. కార్మికుల నిరసనతో పోర్టు వద్ద భారీగా పోలీసులు మోహరించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో క్రీడలకు పెద్దపీట


ఆనంద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛాలు అందిస్తున్న క్రీడాకారులు

కంచరపాలెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తుందని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 56వ వార్డు మేఘాద్రిపేట అశోక్‌పార్క్‌లో సివిల్ యన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జై జగన్నాథ్ క్రికెట్ కప్ టోర్నమెంట్‌లో పాల్గొని ఆయన మాట్లాడారు. నిత్యం విధుల్లో తలమునకలై ఉండే ఉద్యోగులకు ఇలాంటి క్రీడా పోటీలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. రాజకీయాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తనకు ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇవ్వాలని ఆనంద్‌కుమార్ కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు ఆడారి శ్రీను, పి.సురేష్, పల్లా ఎర్నికుమార్, బి.రవీంద్ర, యూనియన్ నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

150 మందికి గుండె వైద్య పరీక్షలు


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న పిలక రామ్మోహనరెడ్డి

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు చింతల్లోవలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి, వార్డు అధ్యక్షుడు సోమాదుల సురేష్ నేతృత్వంలో ఆడారి తులసీరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 150 మంది పాల్గొని గుండె సంబంధిత వైద్య పరీక్షలతో బీపీ, సుగర్, ఈసీజీ, 2డి ఎకో వంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా రామ్మోహనరెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం బాగుంటుందని, ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆడారి తులసీరావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రతి నిరుపేద కుటుంబానికి ఉచితంగా వైద్యం అందించాలనే లక్ష్యంతోనే ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సోమాదుల సురేష్ మాట్లాడుతూ ఆడారి తులసీరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ప్రజలకు విస్తృతంగా వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. పలువురు వైద్యులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్


సుభాష్‌నగర్‌లో ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

కంచరపాలెం: ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 57వ వార్డు ఐటీఐ జంక్షన్ తుమ్మడపాలెం, భవానీగార్డెన్స్, సుభాష్‌నగర్ ప్రాంతాల్లో శనివారం సాయంత్రం వార్డు కార్పొరేటర్ ముర్రు వాణి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పాలనలో సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పేద మధ్య తరగతి ప్రజలకు బాసటగా నిలిచారన్నారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సుపరిపాలన అందిస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను అందించారు. పలువురు వ్యాపారులను ఆత్మీయంగా పలకరించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఏకపక్షంగా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ విజయానికి సహకరించాలని ఆయన కోరారు. ఆనంద్ కుమార్‌కు ప్రతి ఇంటా ప్రజలు హారతులు పట్టి విజయతిలకం దిద్దారు. కార్యక్రమంలో వార్డు సీనియర్ నాయకులు, కార్పొరేషన్ చైర్మన్లు, డెరెక్టర్లు, బూత్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

వేడుకగా పందిరిరాట


పందిరి రాట వేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం ఏపీఎస్ఈబీ కాలనీలో శ్రీరామ నవమి పురస్కరించుకొని శ్రీసీతారాముల కల్యాణోత్సవ పనులకు శనివారం అంకురార్పణ చేశారు. శ్రీ షిర్డీ సాయి ధ్యానమందిరంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు విళ్లా సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో కాలనీ పెద్దలు, ముత్తయిదువులు సమక్షంలో పండితుల మంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా పందిరి రాట వేశారు. ఈ నెల 17న శ్రీరామనవమి రోజున షిర్డీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం జరిపించేందుకు ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబుచేసే క్రమంలో పందిరి రాట వేయడంతో పనులు ప్రారంభించారు. శ్రీరామ నవమి రోజున కల్యాణోత్సవం అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ రావు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ కోశాధికారి సుబ్బారావు, సభ్యులు రాజు, రామకృష్ణ, వెంకటేశ్వ రావు, భూలోక్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సిక్కుల బైసాఖి వేడుకలు


గురుద్వారా సాధు సంగత్‌లో ప్రార్థనలు చేస్తున్న సిక్కులు

సీతమ్మధార: సిక్కుల ప్రధాన పండగ బైసాఖి(వైశాఖి) వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఇదే రోజున సిక్కు గురువు గురుగోబింద్ సింగ్ ఖల్సా స్థాపించిన సందర్భంగా సిక్కులు నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. గురుద్వారా జంక్షన్‌లోని గురుద్వారా సాధు సంగత్‌లో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. సాధు సంగత్ అధ్యక్షుడు ఆనంద్‌సిక్కు గురువుల బోధనలను ఉపదేశించారు. సిక్కులు సంప్రదాయ దుస్తుల్లో గురుద్వారాను దర్శించుకుని ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, సిక్కు కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

కుటుంబీకుల చెంతకు తప్పిపోయిన వృద్ధుడు


సాంబయ్య కుటుంబ సభ్యులతో మమత

విశాఖ విద్య: బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం పొందుతున్న వృద్ధుడిని శనివారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. నాలుగు రోజుల క్రితం అర్ధరాత్రి సమయంలో ఎన్‌ఏడీ ఫ్లైవోర్ కింద తిరుగుతున్న వృద్ధుడికి ఆశ్రయం కల్పించిన జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత, అతని వివరాలపై ఆరా తీశారు. పార్వతీపురం దగ్గర నిలివీధి గ్రామానికి చెందిన మురుముల్ల సాంబయ్యగా గుర్తించారు. దీంతో అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వటంతో శనివారం వారు బుచ్చిరాజుపాలెం షెల్టర్‌కు వచ్చారు. తప్పిపోయిన సాంబయ్య గురించి చాలా చోట్ల వెతికామని, క్షేమంగా అప్పగించినందుకు షెల్టర్ మేనేజర్ మమతకు కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ రవాణా బాధితులను ఆదుకోండి


మాట్లాడుతున్న సంస్థ అధ్యక్షురాలు అపూర్వ

సీతంపేట: రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో అక్రమ రవాణా బాధితులు, సెక్స్ వర్కర్ల సమస్యలు, డిమాండ్లను పరిగణలోనికి తీసుకోకపోతే నోటా ఎంచుకుంటామని అక్రమ రవాణా బాధిత మహిళల ఫోరం స్పష్టం చేసింది. ద్వారకా నగర్ పౌర గ్రంథాలయంలో శనివారం జరిగిన సమావేశంలో అక్రమ రవాణా బాధితులు, సెక్స్ వర్కర్స్ రాష్ట్ర సమాఖ్య విముక్తి సంస్థ రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.అపూర్వ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం 2022 నాటికి రాష్ట్రంలో సుమారు 1.40 లక్షల మంది వ్యభిచారంలో ఉన్నారని, ఏటా 10 నుంచి 15 శాతం మంది ఈ వృత్తిలోకి వస్తున్నారని తెలిపారు. అక్రమ రవాణా బాధిత మహిళలు, సెక్స్ వర్కర్లను ఆదుకోవాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. విముక్తి రాష్ట్ర కార్యదర్శి పుష్ప మాట్లాడుతూ వృత్తితో సంబంధం లేకుండా ప్రతి వ్యక్తి భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం గౌరవప్రదంగా జీవించే హక్కు ఉందన్నారు. విముక్తి రాష్ట్ర నాయకురాలు శాంతి మాట్లాడుతూ బాధితులకు పునరావాసం, విద్య, 40 ఏళ్లు దాటిన వారికి పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరారు. సమావేశంలో బీవీఎఫ్ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు, హెల్ప్ సంస్థ కార్యదర్శి రామ్‌మోహన్, ప్రోగ్రాం డైరెక్టర్ వి.భాస్కరరావు పాల్గొన్నారు.

మహిళా వాకర్స్ సేవలు అభినందనీయం


మాట్లాడుతున్న క్లబ్ అధ్యక్షురాలు లలితారెడ్డి

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమని వాకర్స్ డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ టి.రంగారావు అన్నారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. మహిళలు నిర్వహించే కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి మాట్లాడుతూ క్లబ్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. క్లబ్ కార్యదర్శి సీహెచ్ లక్ష్మి మార్చిలో జరిగిన కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. ఈ నెలలో పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటున్న సభ్యులకు గవర్నర్ టి.రంగారావు చేతుల మీదుగా కానుకలు అందించారు. మహిళలు వేసవి శిక్షణలో తయారు చేసిన జ్యూట్ బ్యాగులు, పెన్సిల్ పౌచెస్‌ను ప్రదర్శించారు. వేసవి శిక్షణ తరగతులకు సహకరించిన కె.గుణను సత్కరించారు. జిల్లా క్యాబినెట్ కార్యదర్శి బి.సత్యనారాయణ, క్లబ్ కోశాధికారి పి.కమల పాల్గొన్నారు.

మహోదాత్త మహిళ సీతాదేవి


ప్రవచిస్తున్న ఆచార్య మలయవాసిని

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో జరుగుతున్న సీతారామ కల్యాణ వసంత నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ సాయంత్రం రామాయణ ప్రవచనాలు జరుగుతున్నాయి. శనివారం సాయంత్రం పీఠం దర్బారు హాల్‌లో విశాఖ సాహితి అధ్యక్షులు ఆచార్య కోలవెన్ను మలయవాసిని రామాయణంలోని సీతాదేవి పాత్రపై ప్రవచనం చేశారు. సీతాదేవి మహోదాత్త మహిళని, రావణ సంహారం కోసమే ఆమె జననం జరిగిందని, సీతారాముల దాంపత్యం లోకానికి ఆదర్శప్రాయమన్నారు. వాల్మీకి చిత్రించిన సీతాదేవి పాత్రలోని భిన్న కోణాలను ఆవిష్కరించారు. విశ్వనాథ సత్యనారాయణ రచించిన రామాయణ కల్పవృక్షంలోని పద్యాలను ఉదహరిస్తూ ప్రసంగం ఆద్యంతం ఆకట్టుకునేలా సాగింది. కార్యక్రమంలో డాక్టర్ డి.వి.సూర్యారావు, కందాల కనకమహాలక్ష్మి, రాంభట్ల నృసింహశర్మ, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

16న ఈడీ కార్యాలయం ముట్టడి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలపై ఈ నెల 16న నిర్వహించనున్న ఈడీ (వర్క్స్) కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్టీల్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఎల్ఎంఎం పార్కులో శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థ ప్రగతి కోసం పనిచేస్తున్న కార్మికుల సంక్షేమంపై యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక పోటీలకు ఆహ్వానం


పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాజశేఖర్

సీతంపేట: మిరాకిల్ మ్యూజికల్ క్లబ్ వ్యవస్థాపకుడు మహమ్మద్ షకీల్ సారథ్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఈ నెల 27, 28 తేదీల్లో ఉదయం 9 నుంచి రాత్రి 7.30 గంటల వరకు సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నారు. శనివారం పౌర గ్రంథాలయంలో పోటీల పోస్టర్‌ను ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ నెల 29న అంతర్జాతీయ నృత్యప్రదర్శన దినోత్సవాన్ని పురస్కరించుకుని శాస్త్రీయ, జానపద నృత్యం, సినీ గీతాలాపన, సంగీత పరికరాల వాద్యం,చిన్నపిల్లలకు విచిత్ర వేషధారణ, పెద్దలకు వస్త్రాలంకరణ పోటీలు నిర్వహిస్తున్నట్లు షకీల్ తెలిపారు.

ఉద్యమంతో కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: కార్మికుల నిరవధిక ఉద్యమంతో కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వరంగ సంస్థల జోలికి వెళ్లకుండా ఉండేలా గుణపాఠం నేర్పుతామన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న నిరాహారదీక్షలు శనివారం నాటికి 1157వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు వారికి అప్పగించాలన్న లక్ష్యానికి ఎదురు తిరిగిన కార్మిక వర్గాన్ని దెబ్బ కొట్టాలని చూస్తున్నారన్నారు. ఇందుకు అనుగుణంగా దొడ్డి దారిన స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడానికి ఉక్కు యాజమాన్యంతో కలిసి విద్రోహ చర్యలు చేపట్టారని ఆరోపించారు.